క్లుప్తంగా

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



మారథాన్ ర్యాలీ నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ రమేష్, పీడీ పద్మమ్మ, విద్యార్థులు

జూపాడుబంగ్లా: ఈనెల 25 నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్రాటోర్నమెంటును పురస్కరించుకొని శనివారం మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్ అధ్వర్యంలో విద్యార్థులు మారథాన్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించటం వల్ల శారీరక దృఢత్వంతో పాటు అనుకొన్న లక్ష్యాలను సులభంగా చేరుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు పద్మామ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



ఆర్ఎస్ గోపాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: పాములపాడులోని వివేకానంద విద్యా విహార్ ఇంగ్లిషు మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ ఆర్ఎస్ గోపాల్‌కు హైదరాబాద్‌కు చెందిన బ్రెయిన్ ఫీడ్ సంస్థ నుంచి జాతీయస్థాయి బ్రెయిన్ ఫీడ్ ఎక్సలెన్సీ 2023–24 అవార్డు అందుకున్నారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు తెలిపారు. శనివారం పాఠశాల ఆవరణలో అవార్డు గ్రహీతను ప్రజా సంఘాలు, కుల సంఘాలు, బంధువులు, స్నేహితులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీఓ గోపాల్‌కృష్ణ, ఆత్మకూరు మార్కెట్ యార్డు చైర్మన్ భాస్కర్, డాక్టర్ నాగన్న, కురుమూర్తి, నాగరాజు, మధు, శివప్రసాద్, క్రీస్తుదాసు, చలపతి, తదితరులు పాల్గొన్నారు.

కోవిడ్ మాక్ డ్రిల్



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంప్రాజెక్ట్ ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం కోవిడ్ మాక్‌డ్రిల్ నిర్వహించారు. కరోనా సోకిన వ్యక్తులకు సకాలంలో అందించాల్సిన వైద్య సహకారం, వైద్య సహాయం అందిస్తున్న వైద్య సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యాధికారులు మాక్‌డ్రిల్ ద్వారా వివరించారు. సిబ్బంది కోవిడ్‌సోకిన వారికి చికిత్సలు అందించేందుకు 24 గంటలు అందుబాటులో ఉండాలని వైద్యాధికారి డాక్టర్ సోహెల్ సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు మహేశ్వరరెడ్డి, పాల ఝాన్సీరాణి, యజ్ఞ బ్రహ్మప్రసాద్, హెడ్‌నర్స్ విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

శాతనకోటలో వికసిత్ భారత్



పథకాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నందికొట్కూరు రూరల్ : నందికొట్కూరు మండల పరిధిలోని శాతనకోట, మల్యాల గ్రామాలలో శనివారం ఈఓఆర్డీ సంజన్న ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను గురించి వివరించారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు జనార్ధన్‌గౌడ్, ఉమాదేవి, ఏఓ షేక్షావలి, ఏపీఓ అలివేలు మంగమ్మ, కోఆర్డినేటర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి పగిడ్యాల మండలంలో ..

పగిడ్యాల: మండలంలో ఈనెల 26వ తేది నుంచి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 26న నెహ్రూనగర్, 27న పాత, కొత్త ముచ్చుమర్రి, 28న సంకిరేణిపల్లె, పగిడ్యాల, 29న లక్ష్మాపురం, పడమర ప్రాతకోట, 30న ఎం. ఘణపురం గ్రామ సచివాలయాల్లో కార్యక్రమాలు ఉంటాయన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

ఆత్మకూరు: మండలంలోని బైర్లూటి పీహెచ్‌సీలో శనివారం కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో కుష్టు వ్యాధి నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 27 నుంచి వచ్చే ఏడాది జనవరి 12వ తేదీ వరకు లెప్రసీకేస్ డిడక్షన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందులో కుష్టువ్యాధి ఉన్న వారిని గుర్తించి, ఉచితంగా చికిత్సలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తామన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయి, ఎలా గుర్తించాలి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రవణమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వైభవంగా ముక్కోటి ఏకాదశి

- శ్రీశైల మల్లన్నకు రావణవాహన సేవ
- మహానందీశ్వరుడికి ప్రత్యేక పూజలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ఉత్తర ద్వారం గుండా దర్శనమిచ్చిన స్వామిఅమ్మవార్లు





రావణవాహనసేవలో భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లు, వెలుగోడు లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ముక్కోటి ఏకాదశిని శనివారం వైభవంగా నిర్వహించారు. శ్రీశైలాలయంలోని శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లకు ప్రత్యేక ఉత్సవం నిర్వహించారు. వేకువజామున శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజాధికాలు , రావణవాహన సేవ నిర్వహించారు. తెల్లవారుజామున 3 గంటలకు ఆలయ ద్వారాలు తెరచి మంగళవాయిద్యాలు, 3.30 గంటలకు స్వామివారి సుప్రభాత సేవ, అనంతరం ప్రాతఃకాల పూజలు జరిపి 4.30 గంటలకు స్వామివారికి, అమ్మవారికి మహామంగళహారతి ఇచ్చారు. ఉత్సవమూర్తులను స్వామివారి ఆలయ ముఖమండప ఉత్తరద్వారం నుంచి వెలుపలకు తోడ్కొని వచ్చి ఆలయ ఉత్తర భాగంలోనే రావణవాహనంపై ఆశీన్నులను చేయించారు. అర్చకస్వాములు స్వామిఅమ్మవార్లకు ప్రత్యే క పూజాధికాలు, హారతులిచ్చి గ్రామోత్సవం జరిపారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. పూజా కార్యక్రమాల్లో శ్రీశైల ధర్మకర్తల మండలి చైర్మన్‌రెడ్డివారి చక్రపాణిరెడ్డి, దేవస్థాన కార్యనిర్వాహణాధికారి డి.పెద్దిరాజు, ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు హెచ్ వీరయ్యస్వామి, మార్కండేయ శాస్త్రి, వేదపండితులు గంటిరాధాకృష్ణ, అధ్యాపక పూర్ణానంద ఆరాధ్యులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ

ముక్కోటి ఏకాదశి ని పురస్కరించుకుని శనివారం శ్రీశైలంలోని శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల దర్శనానికి బారులుతీరారు. వేకువజామునే పుణ్యస్నానాలాచరించిన భక్తులు ఆలయ క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాలనుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు అధికసంఖ్యలో స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. భక్తులరద్దీ దృష్ట్యా స్వామివారి సౌకర్యవంతమైన దర్శనం భక్తులందరికి కల్పించేందుకు గాను ఆలయంలో ఆర్జితసేవలు, గర్భాలయ అభిషేకాలు, రద్దు చేశారు. ఉదయం 6 గంటల నుంచి శీఘ్ర, అతిశీఘ్రదర్శన క్యూలు భక్తులతో నిండిపోయాయి. భక్తులరద్దీ దృష్ట్యా ఆలయ క్యూలలో, కంపార్ట్‌మెంట్లలో భక్తులకు ఇబ్బంది లేకుండా తాగునీరు,అల్పాహారం, బిస్కెట్లు పంపిణీ చేశారు. భక్తులరద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కిటకిటలాడాయి.

మహానందిలో వైకుంఠ ఏకాదశి వేడుకలు

మహానంది: వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలో వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొమ్మా మహేశ్వర్ రెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు రవిశంకర్ అవధాని, రుత్వికులు వేకువజామున నాలుగున్నర గంటల నుంచి విశేష పూజలు చేపట్టారు. శివకేశవులకు నిలయమైన మహానంది ఆలయంలో కొలువైన శ్రీ కోదండరాముడు వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని శ్రీకష్ణ అవతారంలో కొలువై ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకొని శ్రీకృష్ణ అవతారంలో కొలువైన శ్రీ కోదండ రాముడిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసుకున్నారు. నంద్యాల పార్లమెంటు సభ్యుడు పోచా బ్రహ్మానందరెడ్డి దంపతుల సహకారంతో కోదండరాముడికి లక్ష పుష్పార్చన పూజలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి.

ఆత్మకూరులో కనుల పండువగా ..

ఆత్మకూరు: పట్టణంలోని, మండలంలోని వివిధ గ్రామాలలో శనివారం భక్తులు కనుల పండువలా ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని జరుపుకున్నారు. పట్టణంలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో వేకువజామున 4 గంటలకు ఉత్తర ద్వారా దర్శనం భక్తులకు స్వామివారి దర్శనాన్ని కల్పించారు. ఉదయం స్వామివారికి అలంకరణ , సుదర్శన హోమం ,మహామంగళహారతి,కార్యక్రమంతో పాటు స్వామివారి సన్నిధిలో లక్షదీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి పోటెత్తారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అల్పాహారం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి భక్తులతో పాటు ఉత్తర ద్వారం గుండా ఆలయంలోకి ప్రవేశించి ఉత్సవమూర్తులైన శ్రీగోదాదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అర్చనలు, ప్రత్యేక పూజలు, హోమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు.

వెంకటాపురంలో 24న కల్యాణం

మండలంలోని వెంకటాపురం గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో వైకుంఠ ద్వారం ద్వారా స్వామివారి దర్శనం కల్పించారు. స్వామివారి ఉత్సవమూర్తులకు అభిషేకాలు, సుదర్శన హోమం, విష్ణు సహస్రనామ, తులసీ అర్చన, మహామంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 24 న స్వామివారి కల్యాణం గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు రాజరాజేశ్వర మాత భక్తబృందం సభ్యులు తెలిపారు.



ఆత్మకూరులో భక్తులకు అల్పాహారం వడ్డిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

వెలుగోడులో ఉత్తర ద్వార దర్శనం

వెలుగోడు: పట్టణంలోని శ్రీలక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయాల్లో వైకుంఠ ఏకదశి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా ఆలయాల కమిటీ అధ్యక్షులు బళ్లాని వెంకట సత్యనారాయణ, లాలం సుధాకర్‌లు రెండు రోజులుగా ఆలయాలను అందంగా ముస్తాబు చేయించారు. శనివారం తెల్లవారుజాము నుంచే ఉత్తరద్వారం నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీలక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో కమిటీ చైర్మన్ బళ్లాని వెంకట సత్యనారాయణ ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్, జిల్లా కో–ఆప్షన్ సభ్యు డు సయ్యద్ సులేమాన్, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వంగాల నాగేశ్వరరెడ్డి, మండల కార్యదర్శి కే.రామ్మోహన్‌రెడ్డి, ముడిమేల సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైకుంఠనాథుడికి భక్తిశ్రద్ధలతో పూజలు

జూపాడుబంగ్లా: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని మండలంలోని తర్తూరు, జూపాడుబంగ్లా, తరిగోపుల, తాటిపాడు గ్రామాల్లోని శ్రీలక్ష్మీరంగనాథునికి, భూదేవి, శ్రీదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి వార్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్తూరు ఆలయ ఈఓ వెంకటరమణ శ్రీలక్ష్మీరంగనాథుని ఆలయాన్ని పలురకాల పూలతో పాటు రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు బారులు తీరి ఉత్తరద్వారం గుండా ఆలయంలోకి ప్రవేశించి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. జూపాడుబంగ్లాలోని శ్రీవెంకటేశ్వరస్వామివారి ఆలయం, తాటిపాడులోని శ్రీలక్ష్మీచెన్నకేశవ భక్తులు ఉత్తరద్వారం గుండా ప్రవేశించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. సాయంత్రం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి వేడుకలు

పగిడ్యాల: మండల పరిధిలో శనివారం ముక్కోటి ఏకాదశి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవతామూర్తులను పూలమాలలతో అలంకరించి ఆలయాల్లోకి ఉత్తర ద్వారమున భక్తులు ప్రవేశించి విశేష పూజలు చేశారు. భక్తులు నుదుటన విష్ణునామం తీర్చి సంప్రదాయంగా దేవతామూర్తులను ఆరాధించి భక్తిని చాటుకున్నారు.

నందికొట్కూరు రూరల్ : మండలంలో శనివారం ముక్కోటి ఏకాదశి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని బొల్లవరం, కొణిదేల గ్రామాలలోని వెంకటేశ్వర, శ్రీ చెన్నకేశవ స్వామి వార్లు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ఆలయాల్లో ఉత్తర ద్వారం ద్వారా స్వామి వార్లను దర్శించుకున్నారు.



దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిస్తున్న తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామి



శ్రీశైలంలో భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలైన్

● భక్తిశ్రద్ధలతో పూజలు



దేవనూరులో ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

మిడుతూరు: మండలకేంద్రమైన మిడుతూరుతో పాటు దేవనూరు, పీరుసాహెబ్ పేట, కడుమూరు, తలముడిపి, చెరుకుచెర్ల, చౌట్కూరు తదితర గ్రామాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. దేవనూరు, పీరుసాహెబ్ పేట గ్రామాల్లో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాలలో స్వామివారు ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవనూరులో వెంకటసుబ్బయ్య శర్మ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి కల్యాణం మేళతాళల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు.

● ఓంకారంలో అభిషేక పూజలు



పూజలు అందుకున్న ఓంకారేశ్వరుడు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన ఓంకారం ఆలయంలో కొలువైన శ్రీ గంగా, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వర స్వామి వారికి శనివారం, వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ విశ్వనాథ రెడ్డి, ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో అర్చకులు సుధాకర శర్మ, చక్రపాణి శర్మలు స్వామి వారికి రుద్రాభిషేకం , పంచామృత అభిషేకం, సుగంధ ద్రవ్య అభిషేకం కార్యక్రమాలు వైభవంగా చేపట్టారు. అమ్మవారికి కుంకుమార్చన పూజలు జరిపారు.



మహానందిలో కోదండ రాముడికి లక్ష పుష్పార్చన చేసిన దృశ్యం

'ఆడుదాం..ఆంధ్ర'ను విజయవంతం చేయండి

నందికొట్కూరు: ఆడుదాం..ఆంధ్ర క్రీడలపై ప్రజలకు అవగాహన కల్పించి విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ కిషోర్ అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని జైకిసాన్ పార్కులో ఆడుదాం..ఆంధ్ర పోటీలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి పటేల్ సెంటర్ వరకు క్రీడాజ్యోతితో ర్యాలీ నిర్వహించారు. పటేల్ సెంటర్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ అధికారులు, పొదుపు మహిళలు మానవహారం ఏర్పాడి ఆడుదాం ..ఆంధ్ర విజయవంతం చేయాలని నినాదాలు చేశారు. విద్యార్థులు యోగా చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి బాలమద్దయ్య, నంద్యాల, కర్నూలు జిల్లాల శాప్ కో ఆర్డినేటర్లు రవికుమార్, శ్రీనాథ్, నియోజకవర్గ కో ఆర్డినేటర్ డోరతి, మండల కో ఆర్డినేటర్ వీరన్న, ఫిజికల్ డైరెక్టర్స్ జెసింత, పద్మలత, రాజేశ్వరి, లక్ష్మి, సరస్వతి, రాజశేఖర్, పీఈటీలు పాల్గొన్నారు.



జై కిసాన్ పార్కులో ఆడుదాం..ఆంధ్ర క్రీడలను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ కిషోర్

క్రీడాకారులకు చక్కటి అవకాశం

ఆత్మకూరు: క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునేందుకు ఆడుదాం ఆంధ్ర క్రీడలు చక్కటి అవకాశమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, కోఆప్షన్‌సభ్యులు రషీద్ అన్నారు. శనివారం పట్టణంలో ఆడుదాం ఆంధ్రపై విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈ నెల 26 నుంచి ప్రారంభమవుతున్న క్రీడాపోటీలను విజయవంతం చేయాలని కోరారు.మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్ ,మున్సిపల్‌సిబ్బంది

ఆడుదాం.. ఆంధ్రా క్రీడలపై అవగాహన ర్యాలీ

పగిడ్యాల: ఈనెల 26 నుంచి అన్ని గ్రామ సచివాలయాలలో ప్రారంభమయ్యే ఆడుదాం.. ఆంధ్ర క్రీడాపోటీలపై శనివారం పంచాయతీ అధికారులు ఎంపీడీఓ వెంకటరమణ ఆధ్వర్యంలో విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండులో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి క్రీడాపోటీల నిర్వహణపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు సుభాన్, మురళీమోహన్‌రెడ్డి, ఈఓఆర్డీ నాగేంద్రయ్య తదితరులు ఉన్నారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు



క్రీస్తు జననం నాటకాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు

ఆత్మకూరు: పట్టణంలోని పుల్లారెడ్డి ఇంగ్లిష్ మీడియం పాఠశాల నందు శనివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు క్రీస్తు జననం ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ ప్రణీత్‌సాయి చాంద్‌బాష, రమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే కరివేన రహదారిలో ఉన్న డీపాల్ హైస్కూల్‌లోపాఠశాల కరస్పాండెంట్ విద్యార్థులతో కలిసి కేక్ కట్‌చేశారు.

శాంతిమార్గంలో నడవాలి

నందికొట్కూరు: ఏసుక్రీస్తు చూపిన శాంతి మార్గంలోనే ప్రతి ఒక్కరూ ముందుగు సాగాలని శ్లోక స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని శ్లోక స్కూల్‌లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శ్లోక స్కూల్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, డైరెక్టర్ ఎం. శ్రీనివాసరెడ్డి, శ్రీదేవి, కవిత పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంప్రాజెక్ట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు బైజ్యూస్ కంటెంట్ కలిగిన ట్యాబ్‌లను అందజేశారు. 143 మంది 8వ తరగతి విద్యార్థులకు ఈ ట్యాబ్‌లను పాఠశాల ప్రాంగణంలో ఎంఈఓలు కలిముల్లా, శక్రూనాయక్ చేతులమీదుగా పంపిణీ చేశారు. హెచ్ఎం ఈశ్వరమ్మ బాయి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి ఎంఏ రజాక్, మండల అధ్యక్షులు జింకా గుండయ్య యాదవ్, మండల పార్టీ సమన్వయకర్త భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న అధికారులు ప్రజాప్రతినిధులు

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించాలి

జూపాడుబంగ్లా: వలంటీర్లను కాంట్రాక్టు లేదా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వలంటీర్ల సమ స్యల పరిష్కారం కోరుతూ శనివారం జూపాడుబంగ్లా సచివాలయం 1, 2 పరిధిలోని వలంటీర్లు కార్య దర్శి మణికంఠకు సమ్మెనోటీసును అందజేశారు. వలంటీర్లకు నెలకు కనీసం రూ.18వేల వేతనం మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించి డిమాండ్లు పరిష్కరించని ఎడల ఈనెల 25, 26తేదీల్లో ఎంపీడీఓ కార్యాలయాల వద్ద 27, 28 తేదీల్లో కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళన చేపడతామని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుల ఎంపిక

ఆత్మకూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శ్రీశైలం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షులను నియమిస్తూ శనివారం తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలం యువజన విభాగం అధ్యక్షుడిగా సీఎస్‌అల్లిషేర్, వెలుగోడుకు సుధాకర్‌రెడ్డి, శ్రీశైలం మండలానికి ఆరీఫ్, బండిఆత్మకూరుకు దీపుకాంత్ రెడ్డి, మహానంది మండలం యువజన విభాగపు అధ్యక్షుడిగా రమణను నియమించారు.

నందికొట్కూరు నియోజకవర్గం..

నందికొట్కూరు: నియోజకవర్గంలోని మండలాలు, మున్సిపాలిటీకి యువజన విభాగాల అధ్యక్షుల పేర్లను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటించింది. నందికొట్కూరు మండలం యువజన విభాగం అధ్యక్షుడి ఎం నారాయణ, మున్సిపాలిటీకి ఎస్. హిదాయతుల్లా, మిడుతూరు మండలానికి ఎస్. రాజేష్, పగిడ్యాలకు కే. వీ భాస్కర్‌రెడ్డి, జూపాడుబంగ్లాకు ఎస్. హరికృష్ణ, కొత్తపల్లికి కే. దినేష్‌కుమార్, పాములపాడు మండలానికి అధ్యక్షుడిగా బీ. చరణ్‌కుమార్ నియమితులయ్యారు.

రోఖియాబీ దర్గా, షాదీఖానా పనుల పరిశీలన

వెలుగోడు: పట్టణంలోని రోఖియాబీ దర్గా, షాదీఖానా నిర్మాణ పనులను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి శనివారం పరిశీలించారు. ముందుగా దర్గాను సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకుని, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

ఎమ్మెల్యే పరామర్శ..

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వసీంను ఎమ్మెల్యే ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పరామర్శించారు. వెలుగోడు గ్రామానికి చెందిన ఉస్మాన్ కుమారుడు వసీం ఇటీవల నంద్యాలకు వెళ్లి తిరిగి వచ్చే సమయంలో పార్నపల్లె వద్ద బైక్ యాక్సిడెంట్ జరిగి తీవ్ర గాయాలయ్యాయి. కోమా స్థితికి వెళ్లి కోలుకోవడంతో శనివారం ఎమ్మెల్యే విషయం తెలుసుకుని వసీంను పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం మాధవరంలో శివాలయం నిర్మాణానికి రూ.50వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ జయపాల్, జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్, నాయకులు ఖాద్రీ, ఖాదర్‌వలి, షంషీర్ అలీ, మహ్మద్ ఖాన్, తెలుగు రమణ, తదితరులు పాల్గొన్నారు.



రఫీ కుటుంబసభ్యులకు పరిహారం మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా

మహానంది: బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామానికి చెందిన దూదేకుల మహమ్మద్ రఫీ ఏడాది క్రితం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి విద్యుత్‌శాఖ అధికారులతో చర్చించి ప్రమాద పరిహారం అందించేందుకు తన వంతు కృషి చేశాడు. ఈ మేరకు శనివారం ఏపీఎస్‌పీడీసీఎల్ ద్వారా అందిన రూ.5 లక్షల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందించాడు. కార్యక్రమంలో ఏఈ ప్రసాదరెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ పుల్లారెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

మహానంది: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహించకుండా ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని బండిఆత్మకూరు మండల అధ్యక్షుడు దేరెడ్డి చిన్నసంజీవరెడ్డి తెలిపారు. బండిఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయాల్లో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని అర్హులందరికీ అందలా చేయాలన్నారు. ఇప్పటికీ ఎవరైనా పథకాలు రాని వారు ఉంటే సమగ్ర సర్వే చేసి అర్హులకు సంక్షేమ పథకాలు అందించేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ వాసుదేవగుప్త, వైస్ ఎంపీపీ రాగాల వెంకటరమణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రైతు దేశానికి వెన్నుముక

మిడుతూరు: రైతు దేశానికి వెన్నుముక అని ఎంఈఓ –2 శ్రీనాథ్ అన్నారు. శనివారం స్థానిక శ్రీ లక్ష్మీ ఇంగ్లిష్ మీడియం స్కూలులో రైతు దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ విద్యార్థులకు రైతుల కష్టనష్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కరస్పాండంట్ శివకిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్ ఉపయోగకరం



ప్రాజెక్టును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: అటల్ టింకరింగ్ ల్యాబ్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్‌లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టును ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు తిలకించారు. ప్రాజెక్టులను తయారు చేసిన విద్యార్థులను మున్సిపల్ చైర్మన్, ఉపాధ్యాయులు, పలువురు అభినందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి అటల్ టింకేరింగ్ ప్రాజెక్టు కార్యక్రమాన్ని నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఫైజున్నీసాబేగం, ఎంఈఓ–2 శ్రీనివాసులు, హెచ్ఎం రామిరెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.